




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| బుధవారం 29 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 331 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|





## హైదరాబాద్‌ను దేశ వైద్య రాజధానిగా తీర్చిదిద్దుతాం.. అపోలో కొత్త ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: దేశ వైద్య రంగంలో 50 శాతానికి పైగా సేవలు తెలంగాణ నుంచే అందేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అపోలో హాస్పిటల్ (ది హాస్పిటల్ ఆఫ్ గ్రాటిట్యూడ్)ను మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ప్రారంభించిన సీఎం, వైద్య రంగం అభివృద్ధికి అవసరమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ తీసుకొచ్చామని, పశ్చిమాసియా దేశాలతో నేరుగా విమాన సర్వీసుల కోసం కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. గతంలో ఐడీపీఎల్ స్థాపనతో హైదరాబాద్ ఫార్మా హబ్‌గా ఎదిగిందని, ప్రస్తుతం దేశం నుంచి ఎగుమతి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్ నుంచే జరుగుతున్నాయని పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్ దేశానికి ఆదర్శమని, అంతర్జాతీయ స్థాయి బ్రాండ్‌గా కోట్లాది మందికి ఆశాకిరణంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అపోలో వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి, డాక్టర్ సంగీతా రెడ్డి, శోభనా కామినేని, ఉపాసన కొణిదెలతో పాటు యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.



## విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన.. ఏపీని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు

సందేశం టైమ్స్, విశాఖపట్నం, ఏప్రిల్ 29, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయడం ద్వారా దేశంలోనే గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా ఎదిగే దిశగా కీలక అడుగు పడింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ ఏపీ టెక్నాలజీతో పాటు దేశానికి గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోందని, విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ సహకారంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతోందని తెలిపారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సహా అంతర్జాతీయ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2028 సెప్టెంబర్ 28 నాటికి డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో ఏపీ అంతర్జాతీయ డేటా గేట్‌వేగా మారుతుందని, రైల్వే, పోర్ట్ కనెక్టివిటీ వంటి రంగాల్లో కూడా అభివృద్ధి వేగవంతమవుతుందని సమీక్ష సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. ఒకప్పుడు వెనుకబాటుతనం, వలసల ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని నాయకులు పేర్కొన్నారు. అలాగే సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

## పాలేరు, అరెంపుల క్లస్టర్లలో ప్రజా దర్బార్.. ప్రజల సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం: మంత్రి పొంగులేటి



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 29, ప్రతినిధి: ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేరాలనే సంకల్పంతో పాలేరు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లోని 25 గ్రామాల ప్రజల కోసం బుధవారం రెండు కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కూసుమంచి మండలం పాలేరు జవహర్ నవోదయ విద్యాలయం ఆవరణలో, అలాగే మధ్యాహ్నం 3:30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం అరెంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజా దర్బార్ జరగనుంది. ఈ వేదికలపై రెవెన్యూ, విద్యుత్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్ సహా అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించనున్నారు. ప్రతి విన్నపాన్ని నేరుగా పర్యవేక్షించి ప్రజలకు జవాబుదారీగా ఉంటామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పేదల సొంతింటి కల అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, దీర్ఘకాల భూ సమస్యల శాశ్వత పరిష్కారంపై మంత్రి సమీక్ష నిర్వహించి, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ వంటి అంశాలను వేగంగా పరిష్కరించాలని సూచించారు.




## తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్‌కు పోలీసు శాఖలో విశేష అనుభవం ఉంది. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా, అనంతరం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయనను రాష్ట్ర పోలీసు విభాగం అత్యున్నత పదవికి నియమించడంతో పోలీసు వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం.. నక్సలైట్లు కూడా అభివృద్ధిలో కలవాలి: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: స్థానిక ప్రజాప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మీర్ఖాన్‌పేట భారత్ ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి భూమిపూజ, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపనతో పాటు మల్కాజిగిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ పరిపాలనా బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని, వారి సహకారంతోనే ప్రాంతం అద్భుత నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. గ్రామాల విలీనంపై స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని గ్రామ సభల తీర్మానాలు పంపాలని సూచించారు. అభివృద్ధి కోసం భూములు ఇచ్చే రైతులను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని, వారికి నష్టం కలగనివ్వబోమని హామీ ఇచ్చారు. శంషాబాద్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారనుందని, ఫ్యూచర్ సిటీకి మెట్రో అనుసంధానం, భారీ బస్ టర్మినల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే సమయంలో మావోయిస్టు అంశంపై మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉన్న నేతలు, ముఖ్యంగా గణపతి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి వైద్యం, భద్రతతో పాటు ఆర్థిక సహాయం అందిస్తామని, ఇప్పటికే 814 మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్.. యూత్ స్టేట్ సెక్రటరీ పూజిత టీఆర్‌పీలో చేరిక



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీకి చెందిన యూత్ స్టేట్ సెక్రటరీ పూజిత ఆ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)లో అధికారికంగా చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో టీఆర్‌పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పూజితకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసే వేదికగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిలుస్తోందని, బలహీన వర్గాల అభ్యున్నతి, బీసీ రాజ్యాధికార సాధన లక్ష్యాలతో పార్టీ పనిచేస్తోందని, ఈ సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు. ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. టీఆర్‌పీ అధినేత తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పూజిత వంటి యువ నాయకుల చేరికతో పార్టీ మరింత బలపడుతుందని, రాష్ట్రవ్యాప్తంగా యువత టీఆర్‌పీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు ఆమె చేరికను స్వాగతిస్తూ భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి ఆమె కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఎన్‌సీసీ కంపెనీ ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి వివేక్, ఎమ్మెల్యే కాలే యాదయ్య

సందేశం టైమ్స్, చేవెళ్ల, ఏప్రిల్ 29, ప్రతినిధి: చేవెళ్ల దోబిపేట్‌లోని ఎన్‌సీసీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడి శంకర్‌పల్లి పట్టణంలోని లలిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామితో కలిసి చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు, ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, కంపెనీ యాజమాన్యం తరఫున బాధితులకు అన్ని విధాలుగా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా, తగిన పరిహారం అందేలా యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు.



## జోగిపేట ట్రాన్సిట్ హోంను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్ జైల్లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాన్సిట్ హోంలోని పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విదేశీయులు తమ దేశాలకు తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. పాస్‌పోర్ట్ గడువు ముగియడం లేదా ఇతర కారణాలతో ఇక్కడ ఉంచబడిన విదేశీయులను భద్రతతో సంరక్షిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ట్రాన్సిట్ హోంలో 12 మంది విదేశీయులు ఉన్నారని, వారి భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వారికి అవసరమైన సదుపాయాలు కల్పించి నిబంధనలకు అనుగుణంగా చూసుకోవాలని ట్రాన్సిట్ హోం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్‌పీఆర్‌డీ ఇండియా నాయకులు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ ఇండియా వికలాంగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎం. మహేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె పోచయ్య, మహిళా అధ్యక్షురాలు ప్రవీణ్య, గౌరవ అధ్యక్షుడు మహేష్, తెలంగాణ రాష్ట్ర స్పైనల్ కార్డ్ ఇంజురీస్ అధ్యక్షుడు ఎం.డి. షఫీ అహ్మద్ ఖాన్‌తో పాటు సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

## జూన్‌లో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్.. హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి దామోదర్ రాజనర్సింహ





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వైద్య పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. జూన్‌లో అంతర్జాతీయ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, పర్యాటకశాఖతో సమన్వయం సాధించాలని అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్‌లో నిర్వహించిన సమీక్షలో దేశ, విదేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సందర్శనకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమ్స్, టిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతర్జాతీయ రోగుల కోసం ప్రత్యేక విభాగాలు, వార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం కనీసం ఒక మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించాలనే నిర్ణయాన్ని వెల్లడించిన మంత్రి, మే 12న 2322 నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫార్మసిస్ట్, ఎంపీహెచ్‌ఏ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


## షీ టీమ్ అవగాహన కార్యక్రమాలు.. మహిళల భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు చైతన్యం






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 29, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో రంజోల్ పాలిటెక్నిక్ కాలేజ్, మాచ్నూర్ కేంద్రీయ విద్యాలయం, కాశీపూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ పూలభాయ్ మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పితృస్వామ్య వ్యవస్థ, లింగ వివక్ష, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1930, 1098 హెల్ప్‌లైన్ నంబర్లతో పాటు సంగారెడ్డి షీ టీమ్ నంబర్ 8712656772కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు భద్రతా సూచనలు తెలియజేశారు.

## రూ.50 వేల లావాదేవీలకు పాన్ కార్డ్ తప్పనిసరి.. కేంద్రం కొత్త నిబంధనలు అమల్లోకి




సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 29, ప్రతినిధి: ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెంపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పాన్ కార్డ్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. ఇకపై రూ.50 వేలకుపైగా జరిగే పలు లావాదేవీలకు పాన్ కార్డ్ తప్పనిసరి చేసింది. కారు, బైక్, బంగారం, భూమి, ఇల్లు కొనుగోలు, డీమ్యాట్ ఖాతా ప్రారంభం, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు, డిబెంచర్లలో పెట్టుబడులు, రూ.10 లక్షలకు మించిన నగదు డిపాజిట్లు, ఉపసంహరణలు, రూ.లక్షకు పైబడిన సెక్యూరిటీల కొనుగోళ్లకు కూడా పాన్ సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇప్పటివరకు ఉపయోగంలో ఉన్న ఫామ్ 60, 61 స్థానంలో ఫామ్ 97, 98లను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.

# మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



సందేశం టైమ్స్, మహమ్మదాబాద్, ఏప్రిల్ 29, ప్రతినిధి: మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్‌ను మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించి స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యలు సక్రమంగా అమలు చేయాలని, స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రికార్డులను సమయానికి నవీకరించి ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తితో మర్యాదగా, సహనంతో వ్యవహరించి వారి సమస్యలకు తగిన సహాయం అందించాలని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్ రెడ్డి మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. లక్ష ఎల్ఓసీ అందజేత.. బీజేపీ యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 29, ప్రతినిధి: పటాన్చెరు మండలం మున్సిపాలిటీ పరిధిలోని ఐనోల్ గ్రామానికి చెందిన గ్రామస్తునికి అత్యావసర చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1 లక్ష విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయడం జరిగింది. ఈ సహాయానికి ఎంపీ రఘునందన్ రావు సిఫారసు కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా బీజేపీ యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎల్ఓసీ ద్వారా ఆసుపత్రిలో చికిత్స ఖర్చులు భరించేందుకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అవసరమైన వారికి వైద్య సహాయం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇలాంటి సహాయాలు అందిస్తోందని పేర్కొన్నారు.

# ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవతో ఖమ్మంలో పెట్రోల్, డీజిల్ కొరత నివారణ




సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 29, ప్రతినిధి: గడిచిన రెండు రోజులుగా సరఫరా లేక బంకులు మూతపడటంతో ఏర్పడ్డ పెట్రోల్, డీజిల్ కొరత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవతో సమసిపోయింది. పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడైన ఆయన బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ఆయిల్ ట్యాంకర్లను తక్షణమే రిటైల్ అవుట్‌లెట్లకు పంపించాలని సూచించడంతో ఆయా కంపెనీలు స్పందించి సరఫరాను వేగవంతం చేశాయి. సోమవారం 150 ఆయిల్ ట్యాంకర్ల లోడు ఖమ్మం జిల్లాకు చేరగా, మంగళవారం మరో 100 ట్యాంకర్ల సరఫరా కానుంది. దీంతో జిల్లాలోని అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి ఇంధనం నిల్వ చేయవద్దని ఎంపీ కోరారు. ఇదిలా ఉండగా సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర ప్రగడ రంగనాథ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి మంజుల కృతజ్ఞతలు తెలిపారు. అన్ని బంకులు యథావిధిగా వినియోగదారులకు సేవలందిస్తాయని వెల్లడించారు.

# 1శిథిలావస్థలో ఉన్న దేవాలయాల పరిశీలన.. త్వరలో పునర్నిర్మాణానికి శ్రీకారం



సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 29, ప్రతినిధి: నాగులవంచ గ్రామంలో శతాబ్దాల క్రితం నిర్మించబడిన అంకమ్మ తల్లి, మాలచ్చమ్మ తల్లి, మద్దిరావమ్మ తల్లి, పీనగల మల్లయ్య స్వామి మరియు ఇతర గ్రామ దేవతల ఆలయాలు శిథిలావస్థలో ఉండటంతో వాటి పునర్నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఎండోమెంట్ ఏఈ వెంకటరమణ, ఈవో రామకోటేశ్వరరావు, స్తపతి శివ శంకర్‌లతో కలిసి దేవాలయాలను సందర్శించి అవసరమైన కొలతలను గ్రామ పెద్దల సహకారంతో తీసుకున్నారు. త్వరలోనే దేవాలయాల పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అంబటి శరత్, కోదండ రామాలయం కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎల్ఓసీ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 29, ప్రతినిధి: సదాశివపేట మండలం సూరారం గ్రామానికి చెందిన అదీన్ ఫర్జాన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో రూ.85 వేల ఎల్ఓసీ మంజూరైంది. అదేవిధంగా సూరారం గ్రామానికి చెందిన మహమ్మద్ అయాన్ అతీఫ్ కూడా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.75 వేల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ చెక్కులను అందజేశారు. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు.

# వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి – జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్






సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 29, ప్రతినిధి: వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, శానిటేషన్, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై వివరాలు తెలుసుకుని గత వేసవిలో సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని, ప్రతి గ్రామ పంచాయతీకి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కాకుండా చెల్లించేలా చూడాలని, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన లో వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మత్తులు వంటి సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని సూచిస్తూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో అవగాహన కార్యక్రమాలు.. విద్యార్థులకు చైతన్యం




సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 29, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా అందోల్ గ్రామంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, మామిడిపల్లి అగ్రికల్చర్ కాలేజీలలో అంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, మహిళా మరియు బాలల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాద్ రావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, కార్మికుల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, ఈవ్ టీజింగ్, అవయవాల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక దాడులు, సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్, సైబర్ మోసాలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. అత్యవసర సేవల కోసం పోలీస్ ఎమర్జెన్సీ నంబర్లు 100, 112, మహిళల హెల్ప్‌లైన్ 1091, 181, 1098, చైల్డ్ హెల్ప్‌లైన్, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఎస్ఐ ఎం.డి. లాల్ అహ్మెద్, మాణిక్ రెడ్డి, కళాశాలల యాజమాన్యం, సిబ్బంది మరియు సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లాలో సరిపడ పెట్రోల్, డీజిల్ నిల్వలు: ఆర్డీవో రమాదేవి

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 29, ప్రతినిధి: జిల్లాలో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని ఆర్డీవో రమాదేవి తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ పంపును తహసిల్దార్ లక్ష్మణ్ బాబుతో కలిసి పరిశీలించిన సందర్భంగా 12,000 లీటర్ల ఆయిల్ ట్యాంకర్ (8,000 లీటర్ల పెట్రోల్, 4,000 లీటర్ల డీజిల్) చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ నిల్వ 29,232 లీటర్లు, డీజిల్ నిల్వ 26,667 లీటర్లు ఉన్నాయని పేర్కొంటూ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అనంతరం మెదక్ మండలం రాజ్‌పల్లి ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి గన్నీ సంచులు, తాగునీటి సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 1,200 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించగా, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు.






## జైన్ మందిర్ వద్ద బస్సు–లారీ ఢీకొన్న ప్రమాదం.. పలువురికి గాయాలు

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 29, ప్రతినిధి: మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రం సమీపంలోని జైన్ మందిర్ వద్ద బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న డీలక్స్ బస్సు (నంబర్ TS 06 Z 0261) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ముందుగా వెళ్తున్న నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వస్తున్న వడ్ల లోడుతో ఉన్న అశోక్ లేలాండ్ లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న సుమారు 10 నుంచి 15 మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న కొల్చారం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్సులను పిలిపించి గాయపడిన వారిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టపగలే దొంగతనం.. బ్యాంకు క్యూలో రూ.50 వేలు మాయం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 29, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పట్టపగలే దొంగతనం చోటుచేసుకుంది. గూడెం గడ్డ గ్రామానికి చెందిన పర్వతాలు అనే వ్యక్తి జేబులోని రూ.50,000 నగదును దుండగులు అపహరించారు. వివరాల ప్రకారం పర్వతాలు యూనియన్ బ్యాంకు నుండి రూ.50,000 నగదు ఉపసంహరించుకుని అనంతరం స్నేహితుడి ఫోన్ రావడంతో ఎస్బీఐ బ్యాంకుకు వెళ్లి ఫామ్ నింపి క్యూ లైన్‌లో నిలబడ్డాడు. అదే సమయంలో వెనుక నిలబడ్డ వ్యక్తులు కావాలని అతన్ని ముందుకు నెట్టినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో తన జేబులో ఉన్న డబ్బులు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## బాల్యవివాహం బతుకు ఆగం.. మెదక్‌ను బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: అదనపు కలెక్టర్ నాగేష్






సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 29, ప్రతినిధి: ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ పట్టణం రాందాస్ చౌరస్తాలో మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో “బాల్యవివాహం బతుకు ఆగం” నినాదంతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నాగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టి ఆరోగ్యకరమైన, విద్యావంతమైన, సురక్షిత సమాజాన్ని నిర్మించాలని సూచించారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు, చట్టాలు అమలు చేస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించగా, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఈఓ విజయ, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## ఐక్యంగా పోరాడుదాం.. కార్మిక హక్కులు కాపాడుకుందాం: మే డేను జయప్రదం చేయండి – సీఐటీయూ పిలుపు

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 29, ప్రతినిధి: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతూ కార్మిక హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ మే 1వ తేదీన మే డే సందర్భంగా జిల్లాలోని 492 గ్రామాల్లో సీఐటీయూ జెండాలు ఎగురవేసి అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించాలని కోరారు. మెదక్ కేవల్ భవన్‌లో మే డే వారోత్సవాల కరపత్రాన్ని విడుదల చేస్తూ 1885లో కార్మికులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి 8 గంటల పని దినాన్ని సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మే 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తూ అమరవీరుల స్మారక స్థూపాలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ, హమాలి, మధ్యాహ్న భోజన, పరిశ్రమలు, భవన నిర్మాణం, ఆటో, షాపులు, హోటల్, పెట్రోల్, ఆసుపత్రి కార్మికులు అందరూ పాల్గొని మే డే కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ, సహాయ కార్యదర్శి జె. సంతోష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం.. అవగాహన సదస్సులో ఎస్ఐ శంకర్



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 29, ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయంలో బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరూ తొందరపడి వివాహాలు చేసుకోవద్దని సూచిస్తూ బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, విద్యా, సామాజిక ఇబ్బందులను బాలికలకు వివరించారు. చట్టాన్ని గౌరవిస్తూ విద్యపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.